
నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 28 డిసెంబర్ 2024 RANGAREDDY



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న రామన్నగూడ గ్రామస్తులు

## రామన్నగూడను మున్సిపాలిటీలో కలుపొద్దు

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 27 : చేవెళ్ల మున్సిపాలిటీలో రామన్నగూడను కలుపొద్దని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దొళ్ల ప్రభాకర్, బీఆర్ఎస్ యువ నాయకుడు పెద్దొళ్ల దయాకర్ ఆధ్వర్యంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉన్నారని, వారంతా ఉపాధి హామీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీలో చేర్చితే పన్నులు పెరుగడమే కాకుండా పనులు సైతం దొరకవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో మాట్లాడి తమ గ్రామాన్ని మున్సిపాలిటీ నుంచి మినహాయించేలా చూడాలని ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు.

## విమానాశ్రయంలో డ్యూటీ ఫ్రీ లిక్కర్ దందా

**ఇద్దరు ఆర్‌జీఐఏ పోలీసుల అరెస్టు**

**రూ.15 లక్షల విలువ చేసే ఖరీదైన మద్యం స్వాధీనం**

సిటీబ్యూరో/శంషాబాద్ రూరల్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఆర్‌జీఐఏ ఠాణాకు చెందిన కానిస్టేబుల్, హోంగార్డులు డ్యూటీ ఫ్రీ మద్యం విక్రయిస్తుండగా, సమాచారం అందుకున్న శంషాబాద్ డీటీఎఫ్ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.15లక్షల విలువ చేసే మద్యం బాటిళ్లు, రెండు కార్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఈఎస్ కృష్ణప్రియ కథనం ప్రకారం...శంషాబాద్, రాయల్ విల్లాస్ ప్రాంతానికి చెందిన ఎం.జిమ్యా నాయక్ ఆర్‌జీఐఏ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్. బుద్వేల్‌కు చెందిన బండారి లింగయ్య అదే పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ శంషాబాద్ విమానాశ్రయంలోని పోలీసు ఔట్‌పోస్టులో వీఐపీ ప్రొటోకాల్ విధులు నిర్వర్తిస్తున్నారు. జిమ్యానాయక్‌కు ఎయిర్‌పోర్ట్‌లోని డ్యూటీ ఫ్రీ మద్యం దుకాణం బిల్లింగ్ కౌంటర్‌లో పనిచేసే మహేశ్వర్‌తో పరిచయం ఏర్పడింది. ముగ్గురు కలిసి విదేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికుల పాస్‌పోర్ట్, బోర్డింగ్ పాస్‌ల మీద ప్రతిరోజూ 10నుంచి 20వరకు డ్యూటీ ఫ్రీ మద్యాన్ని కొనుగోలు చేసి మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న శంషాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ జి.శ్రీకాంత్‌రెడ్డి తమ బృందంతో కలిసి కానిస్టేబుల్ జిమ్యా నాయక్‌ను శంషాబాద్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అంతే కాకుండా నాయక్ వద్ద మద్యం కొనుగోలు చేసిన మాదాపూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హరీశ్‌కుమార్‌ను సైతం అదుపులోకి తీసుకుని నిందితుల వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గొలిదొడ్డికి చెందిన రాఘవేంద్రరావుకు గోల్డ్‌లేబుల్ బాటిళ్లు విక్రయించినట్లు కానిస్టేబుల్ విచారణలో వెల్లడించడంతో రాఘవేంద్రరావు కారును తనిఖీ చేయగా 8 గోల్డ్ లేబుల్ మద్యం బాటిళ్లు లభించాయి. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మరో కేసులో అరాంఘర్ ఎక్స్‌రోడ్డు వద్ద డ్యూటీ ఫ్రీ మద్యం విక్రయిస్తున్న ఆర్‌జీఐఏ హోంగార్డు బండారి లింగయ్యను పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 23డ్యూటీ ఫ్రీ మద్యం బాటిళ్లు, రెండు డిఫెన్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

## కుక్కకాటుకు మందు లేదిక్కడ..

యాలాల, డిసెంబర్ 27 : కుక్కకాటు మందు లేని దుర్భర పరిస్థితుల్లో ప్రభుత్వ దవాఖానలు ఉన్నాయి. కుక్కకాటు మందు లేదు... వేరోచోటికి వెళ్లండంటూ తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది చెప్పడం విడ్డూరం. సీఎం, స్పీకర్ ఉన్న జిల్లాలో ఇలాంటి పరిస్థితి ఉంటే ఇతర జిల్లాల్లో ఎలా ఉంటుందని ప్రజలు చర్చించుకొంటున్నారు. యాలాల మండలం ముద్దయిపేట గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇతర జిల్లాల, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో నలుగురు మహిళలకు ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. తాండూరు ప్రభుత్వ దవాఖానకు వెళ్లగా తూతూ మంత్రంగా వైద్యం చేసి పంపించారు.



పరిగిలోని గ్లోబల్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్, డెమో శ్రీనివాస్(ఫైల్)




రెండు, మూడు రోజుల్లోనే మళ్లీ క్లినిక్‌ను ఓపెన్ చేసిన నకిలీ వైద్యుడు

# వైద్యాధికారుల వసూళ్ల దందా..!

'కంచె చేను మేస్తే కాచేదెవరన్నట్లు'గా.. అధికారులే వసూళ్ల దందాకు పాల్పడి నకిలీ డాక్టర్లకు అనుమతులు ఇస్తే ప్రజల ప్రాణాలకు రక్షణేది.. కొందరు నకిలీ డాక్టర్లు క్లినిక్‌లు నడుపుతూ జనాల ప్రాణాలతో చెలగాటమాడుతూ డబ్బులు దండుకుంటున్నారు. ఇందుకు ఉదాహరణగా.. పరిగి పట్టణంలోని గ్లోబల్ క్లినిక్‌ను అర్హత లేకున్నా.. దోమ మండలానికి చెందిన రాజు.. నిర్వహిస్తుండగా, ఈనెల 6వ తేదీన డిప్యూటీ డీఎంహెచ్‌వో, డెమో శ్రీనివాస్ తనిఖీ చేసి సీజ్ చేశారు. అయితే మళ్లీ రెండు, మూడు రోజుల్లోనే క్లినిక్‌కు అనుమతి లభించి ఓపెన్ చేయగా, వైద్యాధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారితో సెటిల్‌మెంట్ చేసుకోవడంతోనే క్లినిక్‌కు అనుమతి ఇచ్చారని, ఈ వ్యవహారంలో రూ.లక్షలు వసూలు చేసుకుని నకిలీ డాక్టర్‌ను ఎంబీబీఎస్‌గా ధ్రువీకరించారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ విషయమై సదరు నకిలీ వైద్యుడిని ప్రశ్నించగా.. 'డీఎంహెచ్‌వో సార్‌ను కలువగా.. ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌గా నిర్వహించుకోవాలని చెప్పారు..'.. అని పేర్కొన్నారు. నకిలీ డాక్టర్‌పై చర్యలకు సిఫారసు చేయాల్సిన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటరమణ... ఎందుకు అనుమతి ఇచ్చినట్లని విమర్శలు వస్తున్నాయి. ఇదొక్కటే కాదు క్లినిక్‌లు, దవాఖానల తనిఖీలు, సీజ్‌ల పేరిట వైద్యాధికారులు వసూళ్ల దందా కొనసాగిస్తున్నారని కలెక్టర్, ఏసీబీ అధికారులు దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

- వికారాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ)

**అధికారులే హల్‌చల్ చేస్తారు..**

**తర్వాత సెటిల్‌మెంట్ చేసుకుంటారు..**

జిల్లాలో పుట్టగొడుగుల్లా క్లినిక్‌లు వెలుస్తున్నాయి. కొందరు అర్హత ఉన్నవారు క్లినిక్‌లను నెలకొల్పితే.. కొందరు నకిలీ డాక్టర్లు క్లినిక్‌ల పేరుతో నయా దందాకు తెరలేపుతున్నారు. జిల్లా వైద్యాధికారులు క్లినిక్‌లు, దవాఖానలను తనిఖీలు చేస్తూ అప్పుడప్పుడు హల్‌చల్ చేస్తుంటారు.. అనుమతిలేని క్లినిక్‌ను సీజ్ చేశామంటూ మీడియాలో ప్రచారం చేసుకుంటారు.. తర్వాత వాళ్లే సెటిల్‌మెంట్‌కు పిలిచి రూ.లక్షల్లో వసూలు చేసి సీజ్ అయిన క్లినిక్‌లకు అనుమతులు ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీజ్ అయిన క్లినిక్‌ల నిర్వాహకుల వద్ద రూ.2లక్షల నుంచి 3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రైవేటు దవాఖానలు, క్లినిక్‌లే కాకుండా.. వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోనూ ప్రతీది పైసలిస్తేనే ముందుకు వెళ్తున్నదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**క్లినిక్‌ల సీజ్, తనిఖీల పేరిట రూ.లక్షల్లో వసూళ్లు**

**డబ్బులిస్తే అర్హత లేకున్నా సీజ్ అయిన క్లినిక్‌లకు మళ్లీ అనుమతులు**

**ఆర్ఎంపీలను ఎంబీబీఎస్‌లుగా ధ్రువీకరిస్తున్న అధికారులు**

**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ డాక్టర్లు**

**చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు స్థానికుల వినతి**

**గ్లోబల్ క్లినిక్ ఓపెన్ డీఎంహెచ్‌వోకు తెలుసు..**

ఎలాంటి విద్యార్హతలు లేని కారణంగా పరిగి పట్టణంలోని గ్లోబల్ క్లినిక్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌వోతో కలిసి సీజ్ చేశాం. సంబంధిత క్లినిక్ యథావిధిగా కొనసాగుతున్న విషయం తెలువదు.. అది.. డీఎంహెచ్‌వోకే తెలుసు.. ఈ వ్యవహారమంతా ఆయనే చూసుకుంటున్నారు..

– డెమో శ్రీనివాస్

# కాంగ్రెస్ మోసాలపై కన్నెర్ర..

- ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నిరసనల హోరు..
- కొనసాగుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు, దివ్యాంగులు, ఆశ వర్కర్లు, ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళనలు
- ప్రస్తుతం మండల కార్యాయాల ఎదుట పంచాయతీ కార్మికుల దీక్షలు
- కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని నేడు, రేపు నిరసనలు..


కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అడ్డగోలుగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. ఏడాది గడిచినా ఏ ఒక్క హామీ నెరవేరకపోవడంతో కార్మిక సంఘాలు కన్నెర్ర చేస్తున్నాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు, దివ్యాంగులు, ఆశ వర్కర్లు, ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళనలు కొనసాగుతుండగా పంచాయతీ కార్మికులు సైతం రోడ్డెక్కారు. ఎన్నికలకు ముందు వరాల జల్లులు కురిపించిన రేవంత్ సర్కార్.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు మండల కార్యాలయాల ఎదుట టోకెన్ సమ్మెకు దిగారు. శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు.

- రంగారెడ్డి, డిసెంబర్ 27 (నమస్తేతెలంగాణ)

### పంచాయతీ కార్మికుల డిమాండ్లు..

- పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేసి, కనీస వేతనం రూ.19వేలు చెల్లించాలి
- కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి
- పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతోపాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి
- జీవో నెంబర్ - 51ను వెంటనే సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాంట్ కేటాయించి పీఆర్సీలో అర్హులుగా గుర్తించాలి
- ప్రతి కార్మికుడికీ రూ.5లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని వర్తింపజేయాలి
- విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం ఇవ్వాలి.

**ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..**



కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.19వేలు చెల్లించాలి. జీవో నంబర్ –51ను వెంటనే సవరించి కార్మికులను ఆదుకోవాలి. నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామపంచాయతీల్లో సేవలు అందించే కార్మికులను రాష్ట్ర సర్కార్ పట్టించుకోకపోవడం బాధాకరం.

– బుగ్గ రాములు, సీఐటీయూ మండల కన్వీనర్

**పంచాయతీ కార్మికుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా..**



గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా.. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలిచ్చి ఆశ చూపింద్రు. మా బతుకులు బాగుపడుతమనుకున్నం. అధికారంలోకి వచ్చాక మావైపు కన్నెత్తి చూడడం లేదు. చాలిచాలనీ జీతాలతో మా కుటుంబాలను సాదుకోవడం ఎలా..?.. మార్కెట్లో అన్ని ధరలు పెరిగాయి.. మా జీతాలను పెంచండి సారూ..

– రమేశ్, పంచాయతీ కార్మికుడు



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

# ఆగని ట్రేడ్ లైసెన్స్‌ల దందా!

- ఏటా రూ. 400 కోట్లకు రావాల్సిన చోట రూ. వంద కోట్లు దాటని కలెక్షన్లు
- లైసెన్స్‌లు ఇప్పిస్తామని కొందరు, ఫీజు వసూలు చేసుకుని జేబులో వేసుకుంటున్న మరికొందరు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణలో లేమితో క్షేత్రస్థాయి సిబ్బంది అడ్డగోలు దందా

## పక్కదారి పడుతున్న ఫీజు వసూళ్లు.. బల్దియా ఖజానాకు భారీ గండి

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు పక్కదారి పడుతున్నాయి. లైసెన్స్‌ల ఫీజు, వసూళ్ల బాధ్యత, పర్యవేక్షణ, సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ హెల్త్ (ఏఎంఓహెచ్)లకు అప్పగించగా..ఇందులో కొందరు ఎస్ఎఫ్ఏలు, ఏఎంఓహెచ్‌లు అక్రమాలకు తెరలేపారు. లైసెన్స్‌లు లేని వ్యాపారుల నుంచి అందినంత దండుకోవడం, ట్రేడ్ లైసెన్స్‌లు ఇప్పిస్తామని రూ.10వేలు అయ్యే చోట సదరు వ్యాపారస్తుడి నుంచి రూ. 60వేలు వసూలు చేస్తున్నారు. ఇటీవల జూబ్లీహిల్స్‌లో ఎస్ఎఫ్ఏలు ఈ అంశాలపైనే ఏసీబీకి చిక్కడం గమనార్హం. అంతే కాకుండా కొన్ని చోట్ల ఫీజు వసూళ్లలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జీహెచ్ఎంసీ వచ్చే ఆదాయాన్ని పక్కదారి పట్టించి ఖజానాకు గండి కొడుతున్నారు. వాస్తవంగా 20 ఫీట్ల మేర సింగిల్ లేన్ రోడ్డు ఉంటే చదరపు మీటర్‌కు రూ.3లు, డబుల్ లేన్ రోడ్డు ఉంటే 20 నుంచి 30 ఫీట్ల మేర ఉన్న రోడ్లపై చదరపు ఫీట్‌కు రూ.4, రెండు లేన్ల కంటే ఎక్కువగా ఉండి 30 ఫీట్లకు మంచిన రోడ్లపై చదరపు మీటర్‌కు రూ. 6ల ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు గ్రీనరీ చార్జీలు కూడా చెల్లించాలి. సంబంధిత వ్యాపారి నేరుగా ఆన్‌లైన్‌లో ఈ ఫీజు చెల్లించే వీలు ఉంటుంది. కానీ సర్కిల్‌లోని ఎస్ఎఫ్ఏలు వ్యాపారస్తుల వద్దకు వెళ్లి బేరసారాలకు దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు రూ. లక్ష ఇచ్చే వారి దగ్గర రూ. 50వేల వరకు తీసుకుని వదిలేస్తున్నారు. సదరు వ్యాపారస్తుడి నుంచి వచ్చిన ఫీజు బల్దియా ఖజానాకు చేరడం లేదన్న ఆరోపణలు లేకపోలేదు.

### ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి..

గ్రేటర్ పరిధిలో చిన్న, పెద్ద వ్యాపారాలు కలిపి దాదాపు 12 లక్షల వరకు ఉన్నాయి. ఇందులో రూ. 2.5 లక్షలకు పైగా కమర్షియల్ భవనాలు ఉండగా.. ఈ వాణిజ్య భవనాలన్నింటికీ ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా జీహెచ్ఎంసీకి ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్లలో ఆదాయం గణనీయంగా తగ్గుతున్నది. ఇందుకు వ్యాపారాలకు, వస్తున్న ఫీజులకు ఏ మాత్రం పొంతన ఉండటం లేదని జీహెచ్ఎంసీ రికార్డులే స్పష్టం చేస్తున్నాయి. గ్రేటర్‌లో ఏదైన వ్యాపారం నిర్వహించాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. అధికారులతో సంబంధం లేకుండా పౌరులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అప్పటికప్పుడే లైసెన్స్‌లు పొందేందుకు వీలుగా జీహెచ్ఎంసీ ప్రవేశపెట్టింది. దరఖాస్తుదారులకే తమకు కావాల్సిన లైసెన్స్ సర్టిఫికెట్లను సృష్టించుకునే అవకాశం కల్పించినట్లయింది. జీహెచ్ఎంసీ అమలు చేస్తున్న 'ఇన్‌స్టాంట్ అప్రూవల్ విధానాన్ని మెజార్టీ దరఖాస్తులు దుర్వినియోగం చేస్తున్నారు. మమూలుగా ట్రేడ్ లైసెన్స్ రుసుం.. దుకాణం విస్తీర్ణాన్ని బట్టి పెరుగుతూ ఉంటుంది. ఇక్కడే దీని నుంచి తప్పించుకునేందుకు చాలా మంది దుకాణాదారులు విస్తీర్ణాన్ని నామమాత్రంగా పేర్కొని తక్కువ రుసుంతో లైసెన్స్‌ను పొందుతున్నారు. ఈ రకంగా జీహెచ్ఎంసీ గడిచిన నాలుగేళ్లలో రూ.50 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. ట్రేడ్ లైసెన్స్‌ల జారీలోనే కాదు ప్రతి అంశంలోనూ కొందరు అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. ట్రేడ్ లైసెన్స్‌లలో ట్రేడ్ ఇండెక్స్ నంబరు (టిన్) ఇవ్వకుండా ప్రొవిజన్ విధానంలో.. ప్రాపర్టీ ట్యాక్స్ రెసిడెన్షియల్.. రెండు మూడింతలు పెరుగుతది. ట్రేడ్ లైసెన్స్ పాత ట్రేడ్ ఇండెక్స్ నంబరు.. ఈజీగా ఇవ్వరు.. ప్రొవిజన్ విధానంలో కొనసాగిస్తూ వ్యాపారస్తులతో క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు అందినంత దండుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. మొత్తంగా ట్రేడ్ లైసెన్స్‌ల జారీ విభాగాన్ని సమూల ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ట్రేడ్ లైసెన్స్ కలెక్షన్ ఇలా...**

| ఏడాది | ట్రేడ్ లైసెన్స్‌లు | ఆదాయం రూ. కోట్లలో |
|---|---|---|
| 2018-19 | 40, 422 | 32.91 |
| 2019-20 | 39,501 | 34.47 |
| 2020-21 | 31,166 | 32.63 |
| 201-22 | 34,813 | 46.37 |
| 2022-23 | 74,561 | 72.15 |
| 2023 | 1,06,333 | 81.92 |
| 2024 | 1,07,800 | దాదాపు 97 కోట్లు |

